క్లుప్తంగా

ఫిజియోథెరపీతో మేలు

తెర్లాం: దివ్యాంగులైన పిల్లలకు ఫిజియోథెరపీ ద్వారా ఎంతో మేలు జరుగుతుందని ఎంఈవో జె.త్రినాధరావు, ఫిజియోథెరపిస్ట్ ప్రశాంతకుమార్ అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో పలువురు దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ సేవలు గురువారం అందించారు. ఇక్కడి చేసిన మాదిరిగానే ఇంటి వద్ద కూడా పిల్లలకు ఫిజియోథెరపీ చేస్తే వైకల్యం తగ్గే అవకాశాలు ఉన్నాయని తల్లిదండ్రులకు తెలిపారు. ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఘనంగా డోలోత్సవం



డోలోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాజాం: మండంలోని అంతకాపల్లి గ్రామంలో టీటీడీ పరిధిలోని శ్రీపద్మావతి గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద బ్రహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో గురువారం డోలోత్సవం ఘనంగా చేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త జీఎంఆర్(గ్రంధి మల్లికార్జునరావు) కుటుంబ ఆర్థికసాయంతో పాటు గ్రామస్తులు, భక్తులు అందించిన సహాయ సహకారాలతో కార్యక్రమాలు చేస్తున్నట్లు టీటీడీ ఏఈవో జి.జగన్మోహనాచార్య తెలిపారు.

విచారణ చేపట్టాలి

బాడంగి: మండలంలోని పిండ్రంగివలస గ్రామంలో కొత్తల సత్యనారాయణ అనే వ్యక్తి ఎండీయూ వాహనం నడపకపోయినా ఆయన బ్యాంకు ఖాతాలో నెలకు రూ.18 వేలు చొప్పున జమ అవుతుండడంపై గ్రామస్తుల నుంచి వెల్లువెత్తుతున్న ఆరోపణలపై విచారణ చేపట్టాలని సామాజిక కార్యకర్త రౌతు సురేష్ కోరారు. ఇదే విషయమై ఆయన కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీఎస్‌వో స్పందించి, విచారణకు తెర్లాం సీఎస్‌డీటీ స్వర్ణలతను ఆదేశించారు. గురువారం ఆ గ్రామానికి చేరుకున్న సీఎస్‌డీటీని విచారణకు వచ్చారా అని పలువురు ప్రశ్నించగా, కాదని గ్రామంలో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ పోస్టు భర్తీ విషయమై వచ్చానని ఆమె సమాధానమివ్వడం కొసమెరుపు. అయితే కొత్తల సత్యనారాయణ గ్రామంలో లేకపోవడంతోనే విచారణ వాయిదా పడినట్లు తెలుస్తోంది.

బొబ్బిలి: స్థానిక ప్రభుత్వ ఐటీఐలోని యంత్ర పరికరాలను డిప్యూటీ డైరెక్టర్ ఆర్.వి.రమణ పరిశీలించినట్లు ప్రిన్సిపాల్ జి.వి.రమణారావు గురువారం తెలిపారు. వేటిని వేలం వేయాలో తెలిపారన్నారు.

వాహన తనిఖీలు



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ షేక్ శంకర్

వంగర: స్థానిక బస్టాండ్ వద్ద పోలీసులు గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహన ధ్రువపత్రాలను పరిశీలించారు. ఎటువంటి పత్రాలు లేని వారికి అపరాధ రుసుం విధించారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్‌ఐ షేక్ శంకర్ కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, తదితరులు

సంతకవిటి: మండలంలోని మామిడిపల్లిలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ గురువారం చేపట్టారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా కలిగే ప్రయోజనాలను ప్రకృతి సేద్యం మాస్టర్ ట్రైనీ బి.పద్మ వివరించారు. సేంద్రియ పద్ధతుల ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధ్యమయ్యే ప్రకృతి సేద్యంపై రైతులంతా దృష్టిసారించాలని కోరారు. అలాగే నవధాన్యాలు పొలాల్లో వేసుకుని సాగు చేయాలని, అవి వేసిన 45 రోజుల తర్వాత అదే నేలలో కలియదున్నితే నేల సారవంతమై పంటలు బాగా పండుతాయన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ పాత్రుని వెంకటరమణ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

రేగిడి: గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నామని ఎంపీడీవో జి.శ్యామలకుమారి తెలిపారు. మండలంలోని వన్నలి, చాటాయివలస, ఉప్పర్నాయుడువలస, అక్కన్నఅగ్రహారం గ్రామాల్లో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను ఆమె గురువారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. ప్రతి పంచాయతీలో సేకరిస్తున్న తడి, పొడి చెత్తను చెత్త సంపద తయారీ కేంద్రాలకు తరలించి, సేంద్రియ ఎరువు తయారు చేయాలన్నారు. ప్రజలు కూడా కాలువల్లో అనవసరంగా చెత్త వేయవద్దన్నారు.

ధర్నా



ఇళ్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు, గిరిజనులకు సాగుహక్కు పట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట అప్పన్నలు డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారు పలువురు నిరుపేదలతో కలిసి బొబ్బిలి ఆర్డీవో కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు మూడు సెంట్లు, పట్టణాల్లోని పేదలకు రెండు సెంట్లు చొప్పున ఇళ్లస్థలాలు ఇస్తామన్నారని, అవి వెంటనే ఇవ్వాలన్నారు. అలాగే ఇళ్ల నిర్మాణాలకు రూ.5 లక్షల చొప్పున ఆర్థికసాయం చేయాలన్నారు. నిరుపేద గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములపై వారికి సాగు హక్కులు కలిస్తూ పట్టాలు ఇవ్వాలన్నారు. అనంతరం ఆర్డీవో రామ్మోహనరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, పి.కృష్ణ, జహాన్, చిరంజీవి, టింగు తదితరులు పాల్గొన్నారు. – బొబ్బిలి

5 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

తమ కులానికి 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రెల్లి కులస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై వారు బొబ్బిలి కోర్టు జంక్షన్ వద్ద గురువారం ఆందోళనకు దిగారు. ఎస్సీ వర్గీకరణలో ఎస్సీ–ఏ కింద చేర్చిన తమకు తక్కువ శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నారని, దీంతో తామంతా ఎంతో నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన శిబిరం ఏర్పాటు చేసి, ఎస్సీ–ఏలో 13 ఉప కులాలు ఉన్నాయని, లిపి లేని కులాలను వర్గీకరణలో వేరు చేయకుండా సమన్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత తహసీల్దారు ఎం.శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. – బొబ్బిలిరూరల్




ప్రమాదకరంగా ఏకేఎల్ వంతెన



రేగిడి మండలం, వెంకంపేట దగ్గరున్న ఏకేఎల్(ఆకులలోవకట్ట) గెడ్డపై ఉన్న వంతెన ప్రస్తుతం ప్రమాదకరంగా కనిపిస్తోంది. పెచ్చులూడి బ్రిడ్జి అడుగు భాగం ధ్వంసం కాగా రెయిలింగ్ కూడా పూర్తిగా పాడైంది. దీంతో వంతెన మీదుగా రాకపోకలు సాగిస్తున్న రేగిడి, వంగర మండలాల ప్రజలు బిక్కుబిక్కుమని ప్రయాణం సాగించాల్సిన దుస్థితి. ఏ క్షణాన వంతెన కూలిపోతుందోనన్న భయాందోళన వారిలో నెలకొంది. అధికారులు స్పందించి, వంతెనను బాగు చేయాలని కోరుతున్నారు. – రేగిడి

తగ్గిన రబీ వరి సాగు!



సంతకవిటి మండలంలోని గరికిపాడు సమీపంలో రబీ వరి సాగు

- రబీ సీజన్‌లో వరి సాగు తగ్గుముఖం
- మొక్కజొన్న పండించడంపై రైతుల ఆసక్తి
- కనీసం 100 ఎకరాల్లో కనిపించని పంట
- మార్కెట్‌లో డిమాండ్ లేకనే దుస్థితి

రాజాం: నియోజకవర్గ ప్రజలకు వ్యవసాయమే ప్రధాన ఆదాయ వనరు. అత్యధికులు వరి సాగునే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. అయితే రైతాంగానికి అటు ప్రభుత్వ సాయం లేక.. ఇటు వారి పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ లేకపోవడంతో సాగు విస్తీర్ణం క్రమక్రమంగా తగ్గుతూ వస్తోంది. ముఖ్యంగా రబీ సీజన్‌లో వరి సాగు అంతగా కనిపించడం లేదు. దాని స్థానంలో మొక్కజొన్న పంటను వేసుకుంటున్నారు.

నియోజకవర్గం మొత్తం 72 వేల హెక్టార్లలో సాగు భూమి ఉండగా, వాటిల్లో 60 వేల హెక్టార్లలో ఖరీఫ్ సాగు చేస్తున్నారు. వీటిలో అత్యధికంగా 50 వేల నుంచి 54 వేల ఎకరాల్లో వరి పంట పండించేవారు. మిగిలిన భూభాగంలో మొక్కజొన్న, చెరకు పంటలు పండిస్తున్నారు.

మూడేళ్ల క్రితం అధికం..

ఏటా ఖరీఫ్‌తో పాటు రబీ సీజన్‌లో సైతం సాగునీటి చెరువులు, కాలువలు, బావులు ఉండే ప్రాంతాల్లో రబీ పంటలు సాగు చేస్తారు. మూడేళ్ల క్రితం వరకు రబీ సీజన్‌లో వరి పంట అధికంగా సాగులో ఉండేది. నియోజకవర్గంలో సగటును దాదాపు 10 వేల ఎకరాల వరకు వరి సాగుపై రైతులు మక్కువ కనబరిచేవారు. అయితే మొక్కజొన్న అందుబాటులోకి వచ్చిన తర్వాత వరి పంట సాగును రైతులు వదిలేశారు. గతేడాది రాజాం మండలంలోని లక్ష్మీపురం, నందబలగ, సోపేరు, సంతకవిటి మండలంలోని గరికిపాడు, మందరాడ, సిరిపురం, మండాకురిటి, మామిడిపల్లి గ్రామాల్లో, రేగిడి, వంగర మండలాల్లో అక్కడక్కడా వరి సాగు కనిపించింది. ఈ ఏడాది రాజాం, రేగిడి, వంగర మండలాల్లో పూర్తిగా వరి సాగు నిలిచిపోయింది. సంతకవిటి మండలంలోని గరికిపాడు, మద్దూరుపేట మినహా మిగిలిన గ్రామాల్లో పంట జాడ అస్సలు లేదు. ఈ లెక్కన నియోజకవర్గ వ్యాప్తంగా 100 ఎకరాల్లో కూడా ప్రస్తుతం వరి సాగు లేదని వ్యవసాయ వెల్లడించింది.

నష్టపోవడం కన్నా వదిలేయడమే మేలు..

రబీ సీజన్‌లో వరి పంట వేసి నష్టపోవడం కన్నా పంట వేయకుండా వదిలేయడమే మేలు. గతంలో రబీ సీజన్‌లోనే ఎక్కువగా వరి పండించేవాళ్లం. ఇప్పుడు పంటకు మద్దతు ధర రావడం లేదు. పంట వేసినా గిట్టుబాటు కావడం లేదు. పెట్టుబడి పెట్టి నష్టపోవడం ఎందుకని అనిపిస్తోంది.

– గార రమణ, వన్నలి, రేగిడి మండలం

ఇంటి అవసరాల వరకే..

రబీ సీజన్‌లో పండించే వరి పంటను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఎటువంటి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయదు. దీనికి తోడు దళారీల వద్ద పంట అమ్ముకుంటే నష్టానికే అమ్ముకోవాలి. ఫలితంగా ఇంటి అవసరాల వరకే పంట వేసుకుంటున్నాం. విక్రయించుకుని, లాభం పొందేలా పంట పెద్ద విస్తీర్ణంలో పండించడం లేదు.

– ఎం.నారాయణ, గరికిపాడు, సంతకవిటి మండలం

మద్దతు ధర లభించదనే..

ఖరీఫ్ సీజన్‌లో పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం 60 శాతం కొనుగోలు చేసి మిగిలినది వదిలేసింది. దీంతో దిక్కుతోచని పరిస్థితుల్లో రైతులు దళారీలకు నష్టానికి పంటను అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పుడు రబీ సీజన్‌లో వరి పంట పండించినా నష్టానికే అమ్ముకోవాల్సి వస్తుందని రైతులు అభిప్రాయపడి సాగుకు ముందుకు రావడం లేదనే వార్తలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా పండించిన వరి పంటకు మార్కెట్‌లో కూడా మంచి డిమాండ్ లేకపోవడంతో రబీ వరి సాగు కష్టమైందని రైతులు వాపోతున్నారు. రబీలో వరి సాగు తగ్గడంపై వ్యవసాయ శాఖ ఏడీఏ కె.చంద్రరావు వద్ద సాక్షి ప్రస్తావించగా, పంట మార్పిడి విధానంలో భాగంగా రైతులు వరికి బదులు రబీలో మొక్కజొన్న వేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో రబీ వరి సాగు పూర్తి పడిపోయిందన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా బాబు కృష్ణంనాయుడు



నియామక పత్రం అందుకుంటున్న బాబు కృష్ణంనాయుడు

తెర్లాం: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తెర్లాం తాలూకా అధ్యక్షుడిగా అలజంగి బాబు కృష్ణంనాయుడు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు కంది వెంకటరమణ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తెర్లాం తాలూకా కార్యవర్గ సమావేశం, ఎన్నిక గురువారం సాయంత్రం జరిగింది. సంఘ తెర్లాం తాలూకా అధ్యక్షుడిగా బాబు కృష్ణంనాయుడు ఎన్నికవ్వడంతో పాటు కార్యదర్శిగా షేక్ బెహరున్నీషా బేగం, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వెంకటరమణ, కోశాధికారిగా రామినాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జి.శివకుమార్ ఎంపికయ్యారు. వీరితో పాటు మరో ఆరుగురు ఉపాధ్యక్షులు, ఆరుగురు సంయుక్త కార్యదర్శులను కూడా ఎన్నుకున్నారు. ప్రభుత్వం తక్షణమే పీఆర్‌సీ కమిషన్ నియమించాలని, కమిషన్ నియామకం జరిగేలోపే ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్ డీఏలు వెంటనే ఇవ్వాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే..

వంగర: మండలంలోని ఎం.సీతారాంపురం వద్ద ఉన్న 11 కేవీ ఫీడర్ పరిధిలోని 16 గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ వేమిరెడ్డి సాంబశివరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. విద్యుత్ లైన్లు సరిచేయడంతో పాటు కరెంట్ తీగలను ఆనుకుని ఉన్న చెట్లకొమ్మల తొలగింపు పనుల నేపథ్యంలో శివ్వాం, ఎం.సీతారాంపురం, మద్దివలస, కొట్టిశ, లక్ష్మిపేట, కొప్పర, కొండచాకరాపల్లి, కె.కొత్తవలస, కొప్పరవలస, బంగారువలస, రుషింగి, తలగాం, చినరాజులగుమ్మడ, రాజులగుమ్మడ, వీవీఆర్‌పేట, జేకేగుమ్మడ గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కరెంట్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

రామభద్రపురం: బొబ్బిలి 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనుల కారణంగా మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జేఈ సత్యనారాయణ తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ సౌకర్యం ఉంటుందని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట దగ్గరున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల నేపథ్యంలో సబ్‌స్టేషన్ పరిధిలోని ఉంగరాడమెట్ట, ఆమదాలవలస, రేగిడి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో శుక్రవారం అంతరాయం ఏర్పడుతున్నట్లు ఏఈ వి.సురేష్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

12న విశాఖలో కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలపై సదస్సు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు

బొబ్బిలి: విశాఖపట్నంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 12వ తేదీన కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలపై నిర్వహిస్తున్న సదస్సును విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు కోరారు. ఇదే విషయమై రూపొందించిన కరపత్రాలను ఆయన స్థానిక పట్టణంలో గురువారం విడుదల చేసి, పంపిణీ చేశారు. విద్యుత్ రంగ ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని, కాంట్రాక్టు విద్యుత్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. షిఫ్ట్ ఆపరేటర్లు, ఇతర కేటగిరీల్లో పనిచేస్తున్న వారికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రతి సబ్‌స్టేషన్ వద్ద వాచ్‌మన్‌ను నియమించాలన్నారు. లోకోపైలట్లపై ఉన్న పనిభారం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ ఎస్.గోపాలం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పగడాలమ్మ జాతర



సంతకవిటి: పగడాలమ్మ గుడి



అమ్మవారు

సంతకవిటి: మండలంలోని జావాం గ్రామంలో పగడాలమ్మ జాతర మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ జాతరకు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు రానున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం, రాత్రి భక్తులకు భోజనాలు అందించేలా ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ప్రాతఃకాల, కుంకుమ పూజలతో ప్రారంభమయ్యే ఈ జాతర ఆదివారం జరిగే ఘటోత్సవంతో ముగుస్తుంది. ఉత్సవాల్లో భాగంగా శుక్ర, శనివారాల్లో అంతర్ జిల్లా డే అండ్ నైట్ వాలీబాల్ పోటీలు, ఆదివారం మధ్యాహ్నం సంగిడీలు, గుండురాయి, ఉలవలబస్తాలు ఎత్తే పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. అలాగే శుక్రవారం రాత్రి రేలారే రేలా, శనివారం బాలు రైడర్స్ డ్యాన్స్ ఈవెంట్, ఆదివారం రాత్రి సత్య హరిశ్చంద్ర నాటకం ఉంటాయన్నారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

రాజాం: స్థానిక గాయత్రి కాలనీ రోడ్డులోని శ్రీ వీరహనుమాన్ ఆలయ వార్షికోత్సవాలు శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే వేడుకల్లో ప్రత్యేక పూజలు, ఉత్సవ విగ్రహాల తిరువీధి, సీతారాముల కల్యాణం వంటి కార్యక్రమాలు చేస్తున్నామని పూజల్లో పాల్గొనాలనుకునే వారు ఫోన్ నంబర్లు 9866966191, 9673771905ను సంప్రదించాలని అర్చకులు కోరారు.

ఉద్యోగ భద్రత కల్పించండి




రామభద్రపురం: ఎంపీడీవోకు వినతిపత్రం అందస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

తెర్లాం: తమ సమస్యలు పరిష్కరించాలని ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు(ఫీల్డ్ అసిస్టెంట్లు) కోరుతున్నారు. ఇదే విషయమై వారంతా తెర్లాం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రేగి రాంబాబును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. పథకం ప్రారంభమైన నాటి నుంచి తాము పనిచేస్తున్న తమకు కనీస వేతనం ఇవ్వడం లేదని వాపోయారు. నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ అమలు చేయాలని, ఉద్యోగోన్నతి కల్పించాలని, మండల స్థాయిలో బదిలీలు ఇవ్వాలని, విధి నిర్వహణలో మరణిస్తే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ వారు చేశారు. స్పందించిన ఎంపీడీవో.. ఈ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు.

రామభద్రపురం: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు కోరుతున్నారు. ఇదే విషయమై వారు మండల కేంద్రంలో ఎంపీడీవో రత్నంను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జి.నారాయణరావు, ఎం.ఈశ్వరరావు, ఎం.రామారావు, వై.వేణుగోపాలరావు, డి.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు అమృతం



తెర్లాంలో పౌష్టికాహార పక్షోత్సవాల ర్యాలీలో పీవో రాజ్యలక్ష్మి, తదితరులు

రామభద్రపురం: తల్లిపాలు బిడ్డకు అమృతం వంటిదని, ప్రతి బాలింత బిడ్డకు కనీసం ఆరు నెలల పాటు పాలివ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కృష్ణకుమారి, సూర్యకుమారి, రత్నకుమారి సూచించారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని బూసాయవలస అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార ప్రయోజనాలతో పాటు తల్లిపాల ఆవశ్యకతను ప్రజలకు గురువారం వివరించారు. ప్రతి ఒక్కరూ తాము తినే ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు ఉండేలా చూడాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్లే పిల్లలు వయసుకు తగ్గ బరువు పెరుగుతారన్నారు.

తెర్లాం: బాడంగి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెల 22వ తేదీ వరకు జరగనున్న పౌష్టికాహార పక్షోత్సవాలను విజయవంతం చేయాలని ఐసీడీఎస్ పీవో కె.రాజ్యలక్ష్మి కోరారు. తెర్లాం సెక్టార్ పరిధిలో సూపర్‌వైజర్ ఉషారాణి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన పౌష్టికాహార పక్షోత్సవాల్లో ఆమె పాల్గొని, కాసేపు మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని, అలాగే ప్రతినెలా ఆరోగ్య తనిఖీలు చేయించుకోవాలని తెలిపారు. అనంతరం తెర్లాంలో పౌష్టికాహార పక్షోత్సవాల ర్యాలీ నిర్వహించారు.

బొబ్బిలి: పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు గురువారం సీమంతం నిర్వహించారు. పీవో విజయలక్ష్మి.. గర్భిణులకు పండ్లు, చీరలు, గాజులు అందజేసి, సుఖ ప్రసవం జరిగి పండంటి బిడ్డకు జన్మనివ్వాలని ఆశీర్వదించారు.

సక్రమంగా ఎస్‌డబ్ల్యూపీసీలను నిర్వహించాలి

రాజాం: సక్రమంగా ఎస్‌డబ్ల్యూపీసీ(సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్/చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం)లను నిర్వహించాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని కంచరాం గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించి, సేంద్రియ ఎరువుల తయారీపై అవగాహన కల్పించారు. ఇంటింటి నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను కేంద్రాలకు తరలించి, ఎరువు తయారు చేయాలన్నారు.

'మత్తు'తో జీవితం చిత్తు

రేగిడి: గంజాయి, ఖైనీ, గుట్కా, సారా, మద్యం, సిగరెట్ వంటి మత్తు పదార్థాలతో జీవితం నాశనం(చిత్తు) అవుతుందని ఎస్‌ఐ పి.నీలావతి హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఉంగరాడమెట్ట వద్ద వాహనదారులకు మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై గురువారం అవగాహన కల్పించారు. ప్రస్తుతం విద్యార్థులు, యువత ఎక్కువగా ఫ్యాషన్ మాయలో పడి జీవితాలు చెడగొట్టుకుంటున్నారని, వారిని నమ్ముకున్న కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ మంచి నడవడికను అలవర్చుకోవాలన్నారు.

వర్షంతో ఉపశమనం

రాజాం సిటీ: వేసవి ఎండలతో ఇన్నాళ్లు తీవ్రమైన ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు.. గురువారం సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. దాదాపు 20 నిమిషాల పాటు ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షానికి వాతావరణం చల్లగా మారడంతో జనమంతా ఆనందం వ్యక్త చేస్తున్నారు.

కనీస వేతనం అమలు చేయాలి



వంగర: సమస్యలు పరిష్కరించాలని తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు



సంతకవిటి: తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

వంగర: వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించకుంటే న్యాయ పోరాటానికి సిద్ధమని వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షుడు యజ్జల అప్పలస్వామి అన్నారు. రాష్ట్ర వీఆర్‌ఏల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు మండలంలోని వీఆర్‌ఏలతో కలిసి వంగర మండల కేంద్రంలోని తహసీల్దారు దిరిశాల ధర్మరాజును ఆయన గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. వీఆర్‌ఏలకు కనీస వేతనం అమలు చేయాలని, వారిని నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, పెండింగ్ డీఏలను జీతాలతో కలిపి ఇవ్వాలని, నామినీలను రెగ్యులర్ వీఆర్‌ఏలుగా గుర్తించాలని వినతిపత్రంలో కోరారు. స్పందించిన తహసీల్దారు.. ఈ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.

సంతకవిటి: రాష్ట్ర వీఆర్‌ఏల సంఘం పిలుపు మేరకు మండల వీఆర్‌ఏల సంఘం నాయకులంతా వీఆర్‌ఏలతో కలిసి మండల కేంద్రంలో తహసీల్దారు బి.సత్యంను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. వీఆర్‌ఏల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు సిద్ధమవుతున్నామని ఆ సంఘ మండల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.రాములు, కె.రామప్పయ్యలు తహసీల్దారుకు తెలిపారు. కార్యక్రమంలో గణేష్, కె.నారాయణరావు, బి.తవుడు, కె.పాపారావు, తదితరులు పాల్గొన్నారు.